అంతకు మునుపు వచ్చిన మార్కులే సరియైనవనీ బదులు ఇస్తారనీ అన్నాడాయన''

''మరేమి చేయమంటారో చెప్పండి'' ఆత్రంగా అడిగాడు రంజిత్.

''మీరేమీ అనుకోనంటే ఓ మాట చెబుతానండీ'' అన్నాడు గణేశ్.

''చెప్పండి'' అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు రంజిత్.

''మీరు కొంత డబ్బు ఖర్చు చేస్తే పాస్ మార్కులు వస్తాయండీ'' ఆశకల్పిస్తూ అన్నాడు గణేశ్.

''ఏమాత్రం?'' సిద్ధపడినట్లుగా అన్నాడు రంజిత్.

''అయిదు వందలిస్తే పాస్ మార్కులు వేయిస్తాడటండీ. ఇంతకుముందే ఆయన ఫోన్లో ఆ విషయం చెప్పాడు. మీరు అంగీకరిస్తే ఆ విషయం అతనికి తెలియజేస్తాను. తప్పకుండా మీ పని నెరవేరుతుందండీ. ఏ నిర్ణయమూ మీరు ఓ అరగంటలో తెలియజేయండి'' అంటూ ఫోన్ పెట్టేశాడు గణేశ్.

రంజిత్ ఈ విషయమై భార్యతో చర్చించాడు. ఆమెకూడా రీటోటలింగ్ ఫీజూ, పోస్టల్ ఖర్చులు, ఆ తర్వాత పరీక్ష ఫీజు వగైరాలు తడిసి మోపెడవుతాయనీ దానికంటే ఇదే బాగుందండీ అనీ, డబ్బు విషయంలో కాస్త బేరమాడి తగ్గించమని సలహా ఇచ్చిందామె.

వాళ్ల సంభాషణ వింటున్న కుమార్తె మమ్మీ చెప్పినట్లే చేయమంది.

రంజిత్‌కు కూడా తన భార్య నిర్ణయం సబబుగానే తోచింది.



అరగంట తర్వాత గణేశ్‌కు ఫోన్ చేసి తన నిర్ణయం తెలిపాడు రంజిత్. కానీ డబ్బు కాస్త తగ్గించమని బేరమాడాడు. ఆయన ఓ వంద తగ్గించగా రంజిత్ ఖరాఖండీగా రెండొందలిస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

రెండు రోజులు గడిచాయి. గణేశ్ కనబడి మార్కుల మెమోలు వచ్చాయనీ మీ అమ్మాయికి నలభై ఏడు మార్కులు వచ్చాయనీ అమ్మాయిని కాలేజీకి పంపితే మార్కుల మెమో ఇస్తాననీ చెప్పాడు.

రంజిత్ కూతురు రెండొందలు గణేశ్‌కు సమర్పించి మార్కుల మెమో తెచ్చుకుంది.

ఆ మర్నాడు అనుకోకుండా రంజిత్ బాల్య స్నేహితుడు రాకేష్ కనబడ్డాడు. ఇద్దరూ పలకరింపులూ, క్షేమ సమాచారాలు మాట్లాడుకున్నాక ''రాకేష్ నీవిప్పుడు ఏం చేస్తున్నావు?'' అని అడిగాడు. రాకేష్ తాను యూనివర్సిటీలో పరీక్షా విభాగంలో పనిచేస్తున్నానని చెప్పాడు.

''మార్కులు వేయించేందుకుగానీ, మార్చేందుకు గానీ అవకాశం ఉందా?'' అని రాకేష్‌ని అడిగాడు రంజిత్.

''అలాంటి పరిస్థితులే లేవనీ కొందరు అలా మార్కులు వేయిస్తామని డబ్బులు గుంజి మార్కుల మెమోలో మార్కుల కంటే తక్కువ చెప్పి నాలుగయిదురోజులు పోయాక మార్కులు వేయించామని చెప్పి మోసం చేస్తుంటారు'' అని చెప్పాడు రాకేష్.

రాకేష్ మాటలు విన్న రంజిత్ అవాక్కయిపోయాడు.

గణేశ్ నాటకం తెలిసిపోయింది. అయితే ఏం లాభం చేతులు కాలాక..

**-కరణం రాజేశ్వరరావు** (శ్రీకంఠాపురం)

# పాలబతుకు

''ఓరేయ్ శీనుగా లేవరా. తెల్లారి వెలుగొచ్చినా ఆ మొద్దు నిద్ర ఏంటిరా. లే.లే. వెళ్ళి పాలు తేవాలిరా నాయనా!'' అంటూ అమ్మకుదిపి, కుదిపి లేపేసరికి పడుకోవాలని ఎంత బలంగా అనిపించినా తప్పదని లేచాడు పదేళ్ళ శీను!

రోజూ పొద్దున్నే లేచి రెండు వీధులవతల ఉన్న పాలసుబ్బమ్మ ఇంటికి వెళ్ళి బర్రెపాలు తీసుకురావాలి. తనకేమో ఉదయాన్నే హాయిగా పడుకోవాలనే ఆశ. ఆ ఆశపై నీళ్ళు చల్లుతూ- ''పాలుతేరా...పాలుతేరా'' అంటూ అమ్మ గొణుగుడు. రోజూ తనకిది చిరాకు కలిగించే విషయం! అయినా తప్పదు.

వెళ్ళకపోతే బామ్మ మొదలుపెడుతుంది దండకం. ''పదేళ్ళు వచ్చాయి. మగపిల్లాడు ఆ మాత్రం పాలు తేలేడు'' అంటూ. ఆపదు మరి. ఆవిడకి సూర్యోదయంతోపాటు, కాఫీ గ్లాసు చేతిలో ఉండాలి మరి! ఏతావాతా ఈ పాల బారిన పడ్డాడు పాపం శీను.

అలా బాల్యం గడిచిపోయింది. యవ్వనంలో ప్రవేశించాడు. కాలేజీలో చేరాడు. అయినా రోజూ తనే తేవాలి పాలు. ఎలాగో డిగ్రీ అయిందనిపించి ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగిరి వెలగబెట్టసాగాడు. తల్లిదండ్రుల అభీష్టం మేరకు మేనత్తకూతురు పద్మని వివాహం చేసుకున్నాడు.

హమ్మయ్య ఇకనైనా తనకి ఈ పాలగోల తప్పుతుందేమో అనుకున్నాడు. కానీ, చిత్రంగా రోజూ ఉదయాన్నే శ్రీమతిపద్మ ''బావా లేబావా, పాల



కేంద్రానికి వెళ్ళి పాలు తేవాలి'' అంటూ పాలకొలుపులు పాడసాగింది.

''అబ్బా పద్మా, ఇంటికి వచ్చి పోసేవాళ్ళ దగ్గర పోయించుకోవోయ్'' అన్నాడు ఓ రోజు

''ఆ..వాళ్ళు ఓ రోజు నీళ్ళు, ఓ రోజు పాలు పోస్తారు. మీరు చేసే నిర్వాకం ఏంటట. ఎనిమిది వరకూ కుంభకర్ణుడిలాగా నిద్రపోవటానికేగా ఈ వేషాలు'' అనేసింది తెలికగా!

''హతోస్మి'' అని నిటూర్చాడు పాపం శీను!

పిల్లలు పుట్టారు. పెరిగారు. చదువుకున్నారు. మంచి మంచి ఉద్యోగాల్లో చేరారు. అయినా తనకి పాలు తేవటం తప్పలేదనుకున్నాడు శీను.

ఉద్యోగంలోంచి రిటైరు అయ్యాక ధర్మంగా ఇద్దరు కొడుకులూ చెరో ఆరునెలలు తమని పంచుకున్నారు. హాయిగా ఏ గుళ్ళో, గోపురాలో తిరుగుతూ, మంచి మంచి గ్రంథాలు ఈ వయసులో అయినా చదువుకోవచ్చును అనుకుంటే ఆ ఆశ అడియాసే అయింది శ్రీనివాసరావుగా మారిన శీనుకి!

ఎవరింట్లో వుంటే వాళ్ళకి జీతం భత్యం లేని నౌకరులాగా, ఉదయాన్నే లేచి పాలప్యాకెట్‌లు తేవటంతోనే దినచర్య ప్రారంభం అవుతోంది శీనుకి.

'ఏంటో ఈ పాలబతుకు. నేను పాడె ఎక్కేదాకా ఈపాల డ్యూటీ తప్పదేమో ' అనుకుంటాడు అరవై ఏళ్ళ వయసులో పాపం, శ్రీనివాసరావు!

**-కాకరాల భానుమతి** (హైదరాబాద్)